# రాజీ (నామా)

కుమారి సత్యవతీ రామం

తన రూములో తలపట్టుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రామం. ఏమిటి? తను విన్నదీ. వింటూ వున్నదీ నిజమేనా? తను మనస్ఫూర్తిగా ప్రేమించి, మనసిచ్చిన శోభ తనని మోసం చేస్తోందా? ఆ ఆలోచనలే... అతని అంతరాత్మ ఒప్పుకోవడంలేదు కాని మనసు అంతరాత్మకి ఎదురుతిరుగుతోంది. చెవులతో విన్నదైతే నమ్మకపోవచ్చును కాని తను కళ్ళారా చూశాడే—దానికేమిటి సమాధానం?

తను శోభను మరచిపోలేదు అలాగని ధైర్యంగా అర్ధాంగిని చేసుకుని నలుగురూ తమవైపే చూస్తుంటే సంతోషంగా ఉండనూలేదు. మరేం చెయ్యాలి? ఏమిటీ సమస్యకి పరిష్కారం?

తనింతగా బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడే-శోభకి చీమకుట్టినట్లయినా వుందీ; హాయిగా సంతోషంగా తిరుగుతోంది. తనకేనేమిటీ బాధంతా, తను కాకపోతే మరొకడు దొరుకుతాడనా – తనకేనా దొరకనిది?

ఆడవాళ్ళ మనస్సులు మల్లెపూలకన్నా మెత్తనివీ, అతి సుకుమార మయినవీ అంటారే శోభ మనస్సుమాత్రం రాతిమయమా?

శోభ తనని మరచిపోతుందేమోకాని, తను శోభని మరచిపోలేడే, ఏమిటి తనకీ బలహీనత (మగవాడైయుండికూడా) తనకింత బేల మనసిచ్చినందుకు సృష్టికర్తమీదే కోపంవచ్చింది రామానికి.

శోభనుగురించి ఇష్టంవచ్చినట్లు అది, ఇది అని వాళ్ళ ఆఫీసువాళ్ళు మాట్లాడుతూవుంటే తనే భరించలేక పోతున్నాడే, రోడ్డుమీదకూడా మగవాళ్ళతో ఎందుకంత నవ్వుతూ మాట్లాడడం, మన మనస్సు మంచిదే కావచ్చు. కాని ఎవరికి తెలుస్తుంది? ఎందుకనవసరంగా అపనిందలపాలవడం?

అయినా ఈ మధ్య తనంటే నిర్లక్ష్యం కూడా పెరిగిపోయింది శోభకి. లేకపోతే, మొన్నటికిమొన్న తనవైపైనా చూడకుండా. అతనెవరితోనో, దర్జాగా బస్సెక్కి వెళ్ళిపోతుందా ఎలాగయినా కుదిరిపోయిన పెళ్ళేగా, వచ్చినట్లు చేసుకుంటానని ధీమాయేమో-అంత తలబిరుసు దేనికి?

శోభనుగురించి తన అన్యాయపు ఆరోపణలకి బాధపడ్డాడు రామం. మళ్ళీ, శోభను వదలి తనుండలేడు. కాని తన భార్యగా శోభనుగురించి ఎవరైనా, ఏమైనా అంటే భరించలేడు. ఇది శోభ గ్రహిస్తే ఎంత బాగుండేది. ఎంతకు తేలని, ఎటూ తోచని ఆలోచనలతో అలాగే నిద్రపోయాడు రామం.

• • •

ఛీ, వెధవాఫీసు, ఈ రోజుతో పీడా వదిలిపోయింది. రెండు మూడు రోజుల్లోతను ఫ్రీ, మళ్ళీ క్రొత్తఉద్యోగంలో చేరేవరకూ.

ఆడపిల్ల ఉద్యోగంచేస్తే అందరికీ లోకువే. ప్రతివాడూ, ఏదోఒకటి అనేవాడే తనతో ఏ ఆడపిల్లయినా నవ్వుతూ మాట్లాడవచ్చు. (మాట్లాడాలి కూడా) కాని ఆమెమరెవరితోనూ మాట్లాడడం సహించలేడు. ఎంత సంకుచిత స్వభావాలు—ఒక ఆఫీసులో కలిసిపనిచేస్తున్నాక ఎవరితోనూ మాట్లాడకుండా ఎలా కుదురుతుంది?

అందుకే, ఇక వాళ్ళ బాధలు భరించలేక (కొత్త ఆఫీసుకూడా అలాగే ఉండొచ్చు.) తాత్కాలికంగానైనా విముక్తి కలిగించుకొంటోంది. తను చేసేపని ఎవ్వరికీ చెప్పలేదు. చెపితే మాత్రం ఎవరు అర్థం చేసుకునేవాళ్లు? నువ్వు వాళ్ళవైపు చూడకుండా ఉంటే వాళ్ళు నిన్నే చూసినట్లెలా తెలుస్తుందీ? అనే రకమే అంతా.

అయినా తనేం పసిపిల్లకాదుగా - బాధ్యత లేకుండా ప్రవర్తించడానికి. రెండు, మూడు వారాల్లో ఇంకా మంచి ఉద్యోగానికి ఆర్డర్సు వస్తాయని తెలిసాకేగా రిజైనుచేసింది.

ప్రస్తుతానికి విశ్రాంతి తర్వాత విషయం చూడొచ్చు...కాని తనేంచేసింది. తనను మనసారా ప్రేమించి పెళ్ళికూడా చేసుకోబోతున్న రామానికి కూడా చెప్పలేదు.

ఏం అతనుమాత్రం ఏం తక్కువ తిన్నాడు? తననిబాధించే వాళ్ళలో, మొదటి మెట్టుమీదేఉన్నాడు. అతనైనా తనని అర్థంచేసుకుంటే తనెవ్వర్నీ లెక్క చేసేదికాదు. అతనిక్కూడా అంత సంకుచిత మన స్తత్వం ఉందనుకోలేదు.

మీ యింటికి వస్తాను శోభ! అన్న వెంకట్రావుతో రావద్దు, (మనిద్దరం ఆడపిల్ల మగపిల్లలం, మనిద్దరం కలిసివెళ్తే లోకం చూడలేదు, అని ఖచ్చితంగా ఎలా చెప్పగలదు? అయినా వెంకట్రావు చిన్నప్పటి స్నేహితుడూ, ప్రక్క ఇంట్లో ఉన్నవాడూనే, ఇన్నాళ్ళ తర్వాత కలిసి మీ యింటికి వస్తానంటే ఎలా రావద్దనడం.

అయినా యిద్దరూ కలిసి వెళ్ళడంలో తప్పేముంది? చేతిలో చెయ్యేసుకుని వెళ్ళలేదే. చూసికూడా చూడనట్లు పోవాలా రామం. పలకరిస్తే అతని సొమ్మేంపోయింది?

అతను మారిపోయాడు. మునుపటంత సరదాగా ఉండడంలేదు, పోనీ ముభావంగా కూడా ఉంటున్నాడు, పెళ్లిం అయిపోలేదుగా-తను కాకపోతే మరొకరు

కాని తను...అతనిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తోందే, పెళ్ళి చేసుకోవాలనుకుంటోందే. శోభకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అలాగే కళ్ళుమూసుకుంది, బయట ప్రపంచంతో సంబంధం లేనట్లుగా, నిరాశగా.

* * *

సాయంత్రం అరవుతోంది. అప్పుడప్పుడే చీకటిపడుతోంది. శోభ రాజీనామా ఇచ్చిందన్న విషయం వినగానే, ఉప్పొంగిన ఉత్సాహంతో శోభ ఇంటికొచ్చాడు రామం. రామం తనప్రక్కనే వచ్చి కూర్చునేసరికి, ఊహాప్రపంచంలో ఉన్న శోభ ఒక్కసారి ఉలిక్కిపడింది.

శోభచేతిని తనచేతిలోకితీసుకున్నాడు రామం. అతని సమస్యకు పరిపూర్ణ పరిష్కారం, ఆనందానికి సోపానం దొరికింది. నాకు చాలా ఆనందంగా ఉంది శోభా! నువ్వు ఉద్యోగంవదిలేయడం, నువ్వు అంత శ్రమపడడం నేను సహించలేకపోతున్నాను శోభా, నిజంగా అన్నాడు. (శోభ నమ్మదనుకున్నాదేమో) రామం అందమైన అబద్ధాన్ని అటువైపుగాతిప్పి.

ఉద్యోగం ఎందుకు వదిలేశావు? ఏమయిందీ, ఏమిటీ అని ఎమీ అడక్కుండానే, తన రాజీనామా విషయంలో ఆనందం ప్రకటించిన రామం, చిత్రంగా కనిపించాడు శోభకి పూర్తిగా అర్థమయిపోయాడు కూడా.

రామం మనస్సుని పూర్తిగా అర్థంచేసుకోగలిగింది శోభ. అవును అతను మామూలుమనిషి. ఎవరైనా తనభార్య నేమైనా అంటే సహించలేడు. అతను మగవాడు. మగవాళ్ళ సమాజంలో ఒకడు. సమాజానికి ఎదురీదలేడుసరే, ఎదురీదాలని, ఎదురీదొచ్చని అనుకోడుకూడా.

తను రాజీనామా చేసిందనితెలిసి ఎంతసంతోషంగా ఉన్నాడు-అంత ఆనందంగా ఉన్నతనికి, తనకురాబోయే మంచి ఉద్యోగాన్నిగురించి చెప్పడం కూడా అనవసరమే. ఇక తనుకూడా ఆ విషయం మర్చిపోవడమే మంచిదేమో!

చిన్నతనంలో తల్లిదండ్రులు, అన్నలు - పెద్దయ్యాక భర్త భరిస్తారు. మనసే ఉండకూడని మగువకు - బాధలు, బాధ్యతలు ఏమిటి? ఎంత సంతోషకరమైన విషయం. యువతి, మగువ, స్త్రీ- ఎప్పటికీ అబలే-అంతే అబల-ఆక్రోసించింది శోభ హృదయం.

రామం ఆనందంతో ఏవో చెప్తున్నాడు. అతనేం చెప్తున్నాడో అర్థంచేసుకునే స్థితిలోలేదు శోభ. ఆమె హృదయంలో సముద్ర మథనం జరుగుతోంది. అయినా తనమనస్సుని యథాస్థితికి తెచ్చి, హాయిగా, నిండుగా కాకపోయినా, కొంతలో కొంత, అతని నవ్వులో ఖ్యాతికలపడానికి ప్రయత్నించింది - ఒక ఉద్యోగానికి శాశ్వతంగా రాజీనామాఇచ్చిన శోభ.